క్లుప్తంగా

మహా మృత్యుంజయస్వామికి అభిషేకాలు



స్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో సోమవారం మహా మృత్యుంజయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వహస్తాలతో పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మంత్రి నరసింహమూర్తి, జయంతి మంత్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



ఉక్కు వినాయక ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో సోమవారం రాత్రి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ 19వ వార్షికోత్సవాల్లో భాగంగా వేకువ జామున గణనాథుడికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఐ.వి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్కులు నిర్వహించిన రుద్రాభిషేకంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌పై అవగాహన అవసరం



కంప్యూటర్ అందిస్తున్న జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ అన్నపూర్ణ

అగనంపూడి: ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్‌పై విద్యార్థి దశలోనే అవగాహన కలిగి ఉండాలని జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కె.అన్నపూర్ణ అన్నారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో సమకూర్చిన కంప్యూటర్‌ను జేడీ ఫౌండేషన్ సభ్యులు సోమవారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్, మొబైల్ ఫోన్లలో యాప్‌లను వినియోగించడం సులభంగా నేర్చుకుంటున్నారన్నారు. అదే కంప్యూటర్ తయారీ, కంప్యూటర్ పనిచేసే విధానం, సాఫ్ట్‌వేర్‌పై అవగాహన ఉంటే భవిష్యత్‌లో మంచి కంప్యూటర్ ఇంజినీర్‌గా ఎదుగుతారన్నారు. పదో తరగతి పూర్తయ్యేటప్పటికే కంప్యూటర్‌పై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలనే ఉద్దేశ్యంతో కంప్యూటర్ అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జాతీయ భద్రతా దినోత్సవం

ఉక్కునగరం: జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలు మంగళవారం స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించనున్నారు. 54వ జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఉక్కు మల్టీపర్పస్ హాలులో నిర్వహించనున్న వేడుకలకు స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె. సక్సేనా ముఖ్య అతిథిగా, రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె. శివ శంకరరెడ్డి విశిష్ట అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఉక్కు అధికారులు, ఉద్యోగులు, వివిధ పోటీల విజేతలు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

సెల్ ఫోన్లతో వినికిడి సమస్య



డాక్టర్ సాయి బలరామకృష్ణ

అక్కిరెడ్డిపాలెం: సెల్ ఫోన్ల అతి వినియోగం వినికిడి సమస్యలకు ప్రధాన కారణం అని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ సాయి బలరామ కృష్ణ అన్నారు. సోమవారం అంతర్జాతీయ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని హాస్పటల్‌లో వినికిడి సమస్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలా మందిలో వినికిడి సమస్యకు ప్రధానకారణం ఎక్కువ సౌండ్‌తో టీవీలు చూడడం, హియర్ ఫోన్లలో పాటలు వినడం, గంటల కొద్ది ఫోన్లను వినియోగించడమే అన్నారు. వీటితో పాటు వినికిడి సమస్యకు గల అనేక కారణాలను వివరించారు. వినికిడి సమస్యకు ఇంప్లాంట్లు ద్వారా చికిత్స నిర్వహిస్తే పరిష్కారం దొరుకుతుందన్నారు.

నాడు పేదలందరికీ పక్కా ఇళ్లు ఉండాలన్న ఉన్నత లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసింది. సొంతిళ్లు లేని అర్హత కలిగిన పేదలందరికీ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా ఉచితంగా లక్షలు విలువ చేసే ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేసుకునేలా అవకాశం కల్పించింది.

నేడు సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్ల పథకాన్ని నీరుగార్చింది. ఎన్నో ఆశలతో సొంత ఇళ్లు నిర్మించుకుంటున్న పేదల కడుపు కొట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై సర్కారు నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా పెదగంట్యాడ మండలం నడుపూరులో పేదలందరికీ ఇళ్ల పథకం అటకెక్కింది. దీంతో లబ్ధిదారులు తమ సొంతింటి కల చెదురుతోందని ఆందోళన చెందుతున్నారు.



పెదగంట్యాడ నడుపూరు లే అవుట్‌లో సగంలో ఆగిపోయిన గృహ నిర్మాణాలు

చెదిరిన సొంతింటి కల!

మండలంలో **6,223** మందికి పట్టాలు, ఇళ్ల మంజూరు

చాలవరకు బేస్ మెంట్‌లోనే నిలిచిపోయిన నిర్మాణాలు

ఎనిమిది నెలలుగా కనిపించని పురోగతి

ఆందోళనలో లబ్ధిదారులు

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్ల పథకం పేరును మన ఇళ్లు– మన గౌరవంగా మార్చేసింది. పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ పేదలు గౌరవంగా భావిస్తున్న సొంతింటి నిర్మాణాలకు నిధులు ఇవ్వడంలో శ్రద్ధ చూపడంలేదు.నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో కాలనీలు బోసిపోతున్నాయి.

బిల్లులందక వేదన

సొంత ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులు అందక ఆవేదన చెందుతున్నారు. మండలంలోని నడుపూరులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణాలకు 160 ఎకరాల 14 సెంట్లు స్థలంలో 6223 మందికి కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న పేదలందరికీ ఇంటి పట్టాతో పాటు గృహ నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. గాజువాక నియోజక వర్గ పరిధిలో వేల మందికి సొంతంగా రూ. లక్షలు విలువ చేసే ఇళ్ల పట్టాలను అందించారు. లబ్ధిదారులకు చెల్లించాల్సిన బిల్లుల కోసం సంబంధిత డీఈ, ఈఈలు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేవారు. అవి పరిశీలించిన ఉన్నతాధికారులు తక్షణమే బిల్లులు మంజూరు చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీటి విషయంలో నిర్లక్ష్యం చూపుతోంది. దీంతో ఆయా స్థలాల్లో ముళ్ల చెట్లు, పొదలు దర్శమిస్తున్నాయి. ఇక్కడి సమస్యలపై అటు పాలకులు, ఇటు అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు.

పేదలగూడుపై చిన్న చూపు



పునాదుల స్థాయిలో నిలిచిపోయిన నిర్మాణాలు

గత ప్రభుత్వంలో..

గత ప్రభుత్వం గృహ నిర్మాణం కోసం ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ. 1.80 లక్షలు ఆర్థిక సాయంతో పాటు, పొదుపు మహిళలకు అదనంగా బ్యాంకుల నుంచి రూ. 35 వేలు రుణం ఇచ్చే ఏర్పాటు చేసింది.దాంతో పాటు ఇసుక, ఇనుము, సిమెంటును అందుబాటులోకి తెచ్చింది..

రెండు సెంట్ల మాటే లేదు

గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాల చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. సర్కారు కొలువుదీరి ఎనిమిది నెలలు దాటినా ఇంటి స్థలం కోసం కనీసం దరఖాస్తులు కూడా స్వీకరించలేదని పేద ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

పేదల ఇళ్లు పూర్తి చేయాలి



పేదల పక్కా గృహాల కోసం గత ప్రభుత్వం జగనన్న కాలనీల రూపంలో కొత్త ఊర్లను సృష్టించింది. రాజకీయలకు అతీతంగా పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం పేదల గూడుపై నిర్లక్ష్యం చూపకుండా క్షేత్ర స్థాయిలో సమీక్ష చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్. నాగమణి, పెదగంట్యాడ

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ: ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అండిబోయిన అప్పారావు, భాస్కరరావు ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో రెండు రోజుల పాటు నిర్వహించిన 4వ ఏపీ స్టేట్ డెడ్ లిఫ్ట్ చాంపియన్ షిప్–2025, సెవెన్త్ ఏపీ స్టేట్ బెంచ్ చాంపియన్‌షిప్–2025 పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. సబ్ జూనియర్ విభాగంలో తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన గుత్తుల శ్యామ్‌తేజ స్ట్రాంగ్ మెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. అలాగే జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలకు హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, సత్యారావు, అప్పారావు, శ్యామ్, శశి, త్రినాధరావు, రేష్మ, అప్పలరాజు, పుల్లయ్యరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో థర్మల్ కంఫర్ట్ కీలకం



వరంగల్ ఐఐటీ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: గృహ, వంతెన నిర్మాణాల్లో థర్మల్ కంఫర్ట్ కీలకమైన పరికరమని ఐఐటీ (వరంగల్) ప్రొఫెసర్ కె.కిరణ్‌కుమార్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సోమవారం థర్మల్ కంఫర్ట్ ప్రాధాన్యం, విశిష్టత అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అలాగే శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడం, ఆర్గానిక్, పారిశ్రామిక శీతలీకరణ విధానం, భవన నిర్మాణం డిజైన్ రూపొందించడంలో వీటి ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పరిశోధనాత్మకతపై ఆసక్తి పెరిగి వినూత్న ప్రయోగాలకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు ముమ్మరం



కూర్మన్నపాలెం జంక్షన్‌లో తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కూర్మన్నపాలెం: వాహన తనిఖీలు ముమ్మరమయ్యాయి. దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ ద్విచక్రవాహనాలను నిలిపివేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. నూతన మోటారు వాహనాల చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రత్యేకంగా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. కూర్మన్నపాలెం ప్రాంతంలోని రాజీవ్‌నగర్‌కూడలి, ముస్తాఫా జంక్షన్,వడ్లపూడితో పాటు పోలీస్‌స్టేషన్ ముఖ ద్వారం వద్ద ఇద్దరు ముగ్గురు పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. హెల్మెట్ తోపాటు రికార్డులు పరిశీలించడమేకాకుండా పాత కేసులు ఏమైనా ఉన్నాయా అన్న విషయంపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా సిగ్నల్ జంపింగ్, రాంగ్‌పార్కింగ్, వన్ వేప్రయాణం చేసేవారిపై దృష్టిసారించి జరిమానా బకాయిలు వసూలు చేస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే రూ.100 మాత్రమే జరిమానా వసూలు చేసేవారు. ప్రస్తుతం హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ఏకంగా రూ.1000 జరిమానా విధిస్తున్నారు. అలాగే లైసెన్సులేనివారికి, ప్రమాదకంగా వాహనాలు నడిపేవారికి మోత మోగిస్తున్నారు. అయితే పురవీధుల్లో తిరిగినా అదే పనిగా కాపు కాసి జరిమానాలు విధించడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు బీమా సొమ్ము చెల్లించాల్సిందే..



మాట్లాడుతున్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రామఅప్పారావు

అగనంపూడి: ఎనిమిదేళ్ల కిందట ఉక్కు కర్మాగారంలో ప్రమాదవశాత్తు మరణించినా బీమా సొమ్ము చెల్లించని బజాజ్ ఏలియంజ్ ఇన్సూరెన్స్ సంస్థను జిల్లా వినియోగదారుల కమిషన్–2 వెంటనే పరిహారంతో పాటు వడ్డీ, మానసిక క్షోభకు గురి చేసినందుకు కొంత మొత్తం చెల్లించాలని ఆదేశించిందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు చెప్పారు. అగనంపూడిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2017లో ఉక్కు అధికారి తాతారావు విధినిర్వహణలో మృతిచెందారని, అయితే ప్రమాదవశాత్తు మరణం కాదని ఇన్సూరెన్స్ సంస్థ బీమా సొమ్ము చెల్లించడానికి నిరాకరించడంతో ఏడాది కిందట పలు ఆధారాలతో జిల్లా వినియోగదారుల కమిషన్–2 జి.వెంకటేశ్వరికి ఫిర్యాదు చేశానని చెప్పారు. వాస్తవాలు పరిశీలించిన కమిషన్ నష్ట పరిహారంపాటు 6 శాతం వడ్డీ, మానసిక క్షోభకు గురిచేసినందుకు ఆ కుటుంబానికి అదనంగా మరో లక్ష చెల్లించాలని ఆదేశించిందన్నారు. అలాగే 2020లో ఉక్కులోనే రైలు ప్రమాదంలో మృతిచెందిన పూర్ణచంద్రరావు విషయంలో కూడా ఇలాగే సంస్థ తిరస్కరించడంతో కమిషన్ దృష్టికి తీసుకువెళ్లడంతో వివరాలు, వాస్తవాలు పరిగణలోకి తీసుకుని పరిహారంతో పాటు 6శాతం వడ్డీ, మానసిక క్షోభకు గురిచేసినందుకు మరో రూ.30వేలు చెల్లించాలని కమిషన్ తీర్పునిచ్చిందని రామ అప్పారావు చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

కూర్మన్నపాలెం: కత్తితో దాడికి పాల్పడిన ఒక వ్యక్తిని దువ్వాడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇంకొక వ్యక్తి పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సీఐ మల్లేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ మండలం అప్పికొండ దరి చేపలపాలెంలో చోడిపల్లి పరదేశి అనే వ్యక్తిపై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన చోడిపల్లి ప్రసాద్ దాడికి పాల్పడ్డాడు. అయితే ప్రసాద్‌ను గ్రామానికే చెందిన కొవిరి షణ్ముఖ శివకుమార్ దాడికి పురమాయించినట్లు పోలీసులు చెప్పారు. చోడిపల్లి పరదేశి తన ఇంటి కూర్చుని చిన్న కుమారుడు గంగరాజుతో మాట్లాడుతుండగా ప్రసాద్ అక్కడకు చేరుకున్నాడు. వచ్చీ రాగానే నీ పెద్ద కుమారుడు శివాజీ ఎక్కడని ప్రశ్నించాడు. ఎందుకని అడగ్గా శివరాత్రి రోజున శివ కుమార్‌తో గొడవపడి అవమానపర్చాడని చెబుతూనే శివాజీని చంపుతానని హెచ్చరించాడు. ఇందుకు గాను శివ కుమార్ తనకు రూ.30 లక్షలు సుపారీ ఇస్తానని అంగీకరించడాని తెలిపారు. అలా మాట్లాడుతుండగానే ఇంట్లోకి చొరబడి శివాజీ కోసం వెతుకుతుండగా పరదేశి అడ్డుపడ్డాడు. ప్రసాద్ తనతో పాటు తెచ్చుకున్న కత్తితో పరదేశిపై దాడి చేయగా చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన పరదేశి కోడలు డయల్ 100కు సమాచారం అందించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. పరదేశి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న శివ కుమార్ కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఏప్రిల్‌లో జాతీయ సదస్సు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా ఏప్రిల్ 3,4 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ‘ఆర్థిక సమ్మిళిత–సామాజిక సమానత్వం – 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ ఒక రోడ్ మ్యాప్’ అనే అంశంపై సదస్సు జరగనుంది.

నిరుద్యోగుల పట్ల నిబద్ధతతో మెలగాలి

వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ యజమానులకు సీఐ పార్థసారథి ఆదేశం



ఏపీ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో సీఐ పార్థసారథి

అక్కిరెడ్డిపాలెం: వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ యజమానులు నిరుద్యోగులను విదేశాలకు పంపే విషయంలో నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించాలని గాజువాక సీఐ ఎ.పార్థసారథి సూచించారు. ఆటోనగర్‌లోని డి – బ్లాక్‌లోని ఏపీ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ (ఏపీడబ్ల్యూఐఓఏ చాంబర్) ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులతో సీఐ పార్థసారథి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఓనర్స్ విదేశాలకు ఉపాధి నిమిత్తం పంపేటప్పుడు నియమనిబంధనలు పాటించాలన్నారు. వారి వివరాలను పరిగణలోకి తీసుకుని విదేశాలకు పంపాలని సూచించారు. జీతాలు చెప్పిన ప్రకారం చెల్లించేలా చూసుకోవాలన్నారు. ఈ మధ్య కాలంలో పలువురు నిరుద్యోగులు మోసపోయామని ఆందోళన చేస్తున్న విషయాలను గమనించాలన్నారు. నకిలీ ఏజెంట్లు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. పలవురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న కడియం గౌరీశంకర్, రమాదేవి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల నూతన ఆలయం నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కడియం గౌరీశంకర్, రమాదేవి దంపతుల కుమారుడు సింగపూర్‌కు చెందిన కడియం సతీష్ కుమార్ రూ.25 వేలు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.అలాగే గౌరీశంకర్ కుమార్తె, అల్లుడు చిత్రాల తిరుమలేశు, బిందు రూ.10 వేలు ఇచ్చారు.

- అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కోలాటి కిషోర్ రూ.5116 ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.
- సింధియాకు చెందిన విశ్రాంత హెచ్‌ఎస్‌ఎల్ ఉద్యోగి చెల్లూరు వీరబాబు, కనకమహాలక్ష్మి దంపతులు రూ.5016 విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

400 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో సోమవారం స్టీల్ ప్లాంట్‌కు చెందిన మాధవ్‌బాగ్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. వైద్యులు డాక్టర్ పి.ఝాన్సీ లక్ష్మి, సిబ్బంది ఎన్.సుగుణ, బి.సింధూజ, జి.శివాజీ, ఎం.వి.కుమార్, పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్. కాంతం, పీడీ ఇస్మాయిల్, దేముళ్లు, శ్రీనివాస్, అన్నపూర్ణేశ్వరి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వైపు.. విద్యార్థుల చూపు

- గోపాలపట్నం హైస్కూల్‌లో జిల్లా స్థాయి పోటీలు
- క్విజ్, పోస్టర్ల ప్రదర్శన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్, పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. వీటిని ఏపీసీ ఎస్‌ఎస్‌ఏ డాక్టర్ చంద్రశేఖర్ పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను మెరుగు పరిచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు వారి ఆలోచనా సరళిని మార్చుకుని.. విజ్ఞానం, సృజనాత్మకత వైపు నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య సందేహాలు నివృత్తి చేసుకునేలా స్వేచ్ఛ ఉండాలన్నారు. గ్లోబల్ లీడర్స్‌గా భారత యువత అనే అంశంపై విద్యార్థులు తయారు చేసిన పోస్టర్లు ఆలోచింపజేశాయని తెలిపారు.



గోపాలపట్నం హైస్కూల్ వద్ద సైన్స్ డే కార్యక్రమానికి స్వాగతం పలుకుతున్న చిత్రం

పోటీల్లో 25 పాఠశాలల విద్యార్థులు

సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన క్విజ్, పోస్టర్ ప్రదర్శన పోటీల్లో జిల్లాలోని 25 పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాలుగా పోటీలు జరిగాయి.

- క్విజ్ సీనియర్ విభాగంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, యల్లపువానిపాలెం పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, ఎస్‌ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం పొందారు.
- పోస్టర్ల ప్రదర్శన సీనియర్ విభాగంలో ఎం.జోషిక, మొదటి స్థానం, మధుప్రియ ద్వితీయ, భానుప్రకాష్ తృతీయ స్థానం దక్కించుకున్నారు.



పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- క్విజ్ జూనియర్ విభాగంలో బాలాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ మొదటి స్థానం, ఎస్‌ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ రెండో స్థానం సాధించాయి.
- పోస్టర్ల ప్రదర్శన జూనియర్ విభాగంలో సిహెచ్.మోహన్ మొదటి స్థానం, అక్షయ అభివర్మ రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు డాక్టర్ చంద్రశేఖర్ బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, ఎస్‌జీసీ జిల్లా సమన్వయకర్త ఎస్.బాబూరావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.